


# గాలి పల్లకీ

ఉమ

# గాలి పల్లకి

రచన: **ఉమ**


చిరునామా:

**Dr. Uma Eyyinni**
355, North Shore Circle
Unit 1314, St. Augustine,
FLORIDA - 320 92.
U.S.A.



**Price: ₹ 50/-**
**$ 5**

ముఖచిత్రం: **బాపు**

D.T.P.:
**V. Asha Rani**
Musheerabad, Hyderabad.
Ph: 868 664 5226.

Printed at:
**Kala Jyothi Process Pvt., Ltd.,**
1-1-60/5, R.T.C. Cross Roads,
Musheerabad, Hyderabad-500 020.
Ph: 040-27645536, 27612436.

# ఓ మాట

ఖండాంతరాల నుండి తనదైన గడ్డకు
విమానయానం ద్వారా అప్పుడప్పుడూ
అడుగిడుతూ పలితలను **గాలి పల్లకి** ద్వారా
తమ మనోగమ్యాలకు చేర్చబూనుతున్న
కవయిత్రి చమత్కారం అభినందనీయం.

జిగేలుమని మెరసి ఆ సంభ్రమంలో
వెలుగులను ఏమరుపాటుగా గమనిస్తున్న
దశలో 'గాలిపల్లకినెక్కి నేల వీడిన
వలపు / చేరబోవున విభుని' అని
ప్రశ్నించి, ప్రశ్నతోనే సమాధానపరిచే
దార్శనికత పదాల ద్వారా దూసుకెళుతుంది.

మబ్బు తెరలు, మంచు పొరలు, కలల దారులు,
ఆశల సఖులు, మెయిలు దారులు
ఈ విధంగా ప్రతి పదంలో లాస్యం చేస్తుంది
అంతర్లీనమైన అనంత గమనం.

'తుహిన కణాలు' వెలువరించిన రెండు
వత్సరాల్లోనే **గాలి పల్లకి** కవితా సంకలనం
రూపు సంతరించుకోవడం ముదావహం.

పరిణామ క్రమంలో అనుభవాల
దొంతరలను భావుకతతో మేళవించగా
ఆవేదన నుంచి ఆర్ద్రత జనింపజేసే
కవితలెన్నో ఉన్నాయి ఈ సంకలనంలో.

వీలైనప్పుడల్లా చదువుకుంటూ
పదాలలో మన జీవిత ఘటనలను
అన్వయించుకోవడానికి దోహదం
చేసేదీ కావ్యమాల.

**డి. చక్రపాణి**

# కృతజ్ఞతలు

**గాలి పల్లకి** ముద్రణలో బాధ్యత వహించిన ఆత్మీయ మిత్రులు డి. చక్రపాణి, వై. రామకృష్ణారావు, పి. శేషగిరిరావులకు–

ముఖచిత్రాన్ని అందంగా, భావగర్భితంగా చిత్రించిన ప్రముఖ చిత్రకారులు, చలనచిత్ర దర్శకులు – శ్రీ బాపుగారికి–

ఈ సంకలనం ఇంత అందంగా రూపొందటంలో ప్రత్యక్షంగ, పరోక్షంగా సహకరించిన శ్రేయోభిలాషులెందరో–

అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు.

**ఉమ**

# విషయసూచిక


1. గాలిపల్లకి ........................................ 1
2. గరిక చివుళ్లు .................................... 15
3. చెలిమి ............................................ 16
4. పసి నిసుగ! ...................................... 17
5. రాగలహరి ........................................ 18
6. ఎద దివ్వెలు ..................................... 19
7. ఎద తునక ........................................ 20
8. నీహారిక నివేదన... ............................ 21
9. చెలికాడ! .......................................... 24
10. ఒడివీడి .......................................... 25
11. విరజాజి విభుడు ............................... 26
12. ఆవేదన ........................................... 28
13. తెలుగు వెలుగులు ............................... 29
14. జయతు జయతు ................................... 31
15. వలపు వెన్న ..................................... 32
16. రామకృష్ణ ........................................ 33
17. ప్రకృతి పలికేను .................................. 34
18. మబ్బులు .......................................... 35
19. పక్షులు ........................................... 36
20. పూవు పుట్టుక .................................. 37

21. ఎదగళము ........................................ 42
22. శిశిరం ................................................ 43
23. వసంతం ............................................ 44
24. కొంగెక్కడే నీది - కొమ్మరో నేడు...?? ..... 45
25. సంక్రాంతి ........................................... 48
26. వెదురు పొదల వెన్నెల ......................... 51
27. మురళి రవళి ...................................... 52
28. చరమాంకం ...................................... 53
29. చుక్కలార ........................................... 56
30. నాదఝరులు .................................... 57
31. కలలలో ............................................. 59
32. పున్నమి రేయి ..................................... 60
33. ప్రణయహేల ....................................... 61
34. పద్మావతీ శ్రీనివాసం!! ......................... 62
35. సమర్పయామి!! .................................. 68
36. సమర్పయామి!! .................................. 71
37. సప్తస్వరఝరి ..................................... 74
38. అద్వితీయం, సంఖ్యా కథనం .............. 79

# గాలిపల్లకి

గగన మండలము బోలు గంభీర గతుల
కన్నులరమోడ్చి చూసేటి చూపులు
ఝుంకారముల సేయు తుమ్మెదల బోలు
మేఘాల దాగున్న నీలిమలు కాబోలు!

ఉదయాద్రి ఎరుపులో, ఉడురాజు పిలుపులో
కదిలేటి కడలి కెరటాల మలుపులో
ఇసుక తిన్నెల తాకు నురుగుల్ల తెలుపులో
పసిడి సంపెంగ రేకు దాగేటి వలపులో
పలుకరించేను నన్ను నీ తలపు ఊసులు
వెలువరించేనవిగొ తొలి జన్మ బాసలు

మనసు వెన్నెలపంట సఖుడ నీ చెంత
అరసి నీ చెలిమి, వెలుగాయె బ్రతుకంత!
గాలి పల్లకిలోన, పూలబోయిల తోడ
ఊరేగి నే రాగ, ఉర్వి పులకించేన!!

నీ పెదవుల మధురిమ నందిన మురళి
పులకితయై వినిపించిన జీవన రవళి
సడిసేయని సరిగమల ఎద సడి
నడిరేయి సెలయేటి అలజడి!

కురిసే వెన్నెల వెలుగుల
మెరిసే మోవి నగవులు
పెదవి దాగిన పగడాలు
పొదవి కొన్నవి రాగాలు

శ్రుతి కలిపిన గీతాల
జత కలిసిన భావాలు
లయ తప్పని పాదాల
పెనవేసిన లాస్యాలు!

పులకించెను పున్నమిరేయి
తిలకించెను గగనపు కనుదోయి
పూలబోయిలతోడ, గాలిపల్లకినెక్కి
నీలమోహన, నీకు నేనర్పణముకాగ
ఈ జగతి మన ప్రేమదర్పణము కాద!!

కనురెప్పల సవ్వడికి, జతకలిపే ఎదసడి
వినిపింపని మువ్వల కథ తెలిపే అలజడి
సెలయేటి గలగలల బదులాడని కబురది
ఎలతేటి గుసగుసల దోగాడే దిగులది.

విరిసిన పూయెదను ఒదిగిన తలపది
మురిసిన నా హృదిని పొదిగిన పిలుపది
కలసిన కనుచూపుల కదలాడే కలయది
మనసున నిను చూచిన చెలరేగే వలపది!

గాలిపల్లకినెక్కి చెలరేగే ఊహలు
పూలబోయిలు మోయ, నిను చేరె ఊసులు!!

అలల హోరు ఎదను తాక
కలలు కరిగె సొదలు సమసి
కడలియంచు కదలిపోగ
పుడమి యెడద కరిగిపోయె

పలుకలేని పెదవి మూగవోయి
తెలుపలేని వెతలు దాగిపోయె
కలసిపోయిన మనసులేమొ
కలగిపోయెడి కలతలాయె

నీవె నేనని నిన్న పలికి
నేడు మరచిన రేపు ఏది?
నిన్న మొన్నల విన్నపములు
గాలి కలసిన రూపు ఏది?

గాలపల్లకినెక్కి ఎదయేగ దూరాలు
చేరనగున తీరము, కోరి వేచిన గమ్యము??

కనురెప్ప నేస్తమై పిలచేను కల ఒకటి
కరగి, కనుల కాటుక, నిలచేను ఒక పరి
కనువిప్పి నే చూడ, కనరాని ఆకృతి
కనుమూసినంతనే, తరచేను నా హృది

చీకట్లు మూగేన, నా బ్రతుకు దారి
చిరుదివ్వె నీవు, వెలిగింపరావేమి?
కరమోడిచ్చు నీ ఎదుట నిలచేన నా స్వామి
చిరునవ్వునే దాచి, వేధింతువేమి?

వెలుగు పుంతల సాగు ఈ బ్రతుకు తీరు
కలగి చింతలనేడు, కదలగా లేదు

గాలిపల్లకి నెక్కి నినుకోర తలపులు
నేలరాలెనె నేడు నిను చేరు ఆశలు!!

పలుకలేని పదమొక్కటి
పూరేకుల పెదవి పొదిగె
తెలుపలేని వలపొక్కటి
తలపు మలుపు మాటు వొదిగె...

తెలివెలుగు రేక వచ్చె
ముకుళించిన మొగ్గ విచ్చె
చిలిపి పవనుడు పలుకరించె
వలపు తలపులవె చిగురించి

గాలి పల్లకినెక్కి నేల వీడిన వలపు
చేరబోవున విభుని, దూరమేగిన సఖుని??

తలిరాకు తల్పాల దాగున్న విరులు
కనువిప్పు కురిసేను శతకోటి సిరులు
అలనీలి గగనాల మెరసేను తారకలు
ఇల నీలి కలువకై అరసేను చంద్రికలు

పచ్చ పచ్చ నాకుల
నెచ్చెలుల వీడి
అచ్చరల లోకాల
అచ్చెరువుల తలచి

గాలిపల్లకి నెక్కి
ఊరేగె ఊహలు!
ఆకశాన చెలుడట
ఆశలన్ని సఖులట
ఆలకింప స్వరఝరులు
పాలపుంత సరిగమలు!!

మబ్బు తెరలు తొలగి
మంచు పొరలు కరగి
మనసు కనులు తెరచి
కనెను మధుర స్వప్నము

కలల దారి నడచి
చెలియ నొడిని చేర్చి
కలత తీర్చె సఖుడు
కరుణమూర్తి విభుడు

ఒదిగిన చిరుగాలి
వెదురు పొదల దాగి
శ్రుతి చేసెను స్వరము
జతకుదరగ మనము

గాలిపల్లకినెక్కి
బయలు వెడలిన పయనము
మొయిలు దారుల సాగి
చేరినది గమ్యము!!

మల్లె పొదల మాటున దోబూచులాడి
మనసు దోచిన చెలుడ మరుగైతివేల?
మన బాసలే తలచి, మరి మరి పులకించి
మరల ఆమనికై మరి ఎందు వెదికేను?

సంధ్య వెలుగులు తోచ, నీ పిలుపులే విని
వెండి జాబిలి వెలుగ, నీ నవ్వులేయని
వెన్నెల ననుతాక, నీ మృదుకరములేయని
ఉలికిపడు నను చూచి, చిరునవ్వు నవ్వేవు.

కనుసన్నల నను బంధించి వేసేవు
చిరునవ్వుతో సరసమాడేవు
సఖుడ! నన్నేలుమని కోరువేళ
చటుకున ఎట దాగి నను పరితప్త చేసేవు?

గాలిపల్లకిలోన ఊరేగి నేరాన?
పూలబోయిలు నను మోయంగ నీ దరికి
చేయంది నీ సఖియ నెద చేర్చుకోవేల
చిన్ని బ్రతుకు నాది చిగురించి పోవ!!

అల నీలి గగనాల ఉదయించె జాబిలి
వెలుగు నిండిన రేయి కనవోయిని చెలి
చెలిమి పంచిన చెలుడ, అది నాకు పున్నమి
కలలు దోచిన సఖుడ, నీవె నా కలిమి.

కనుదోయి కలవంగ కనువిప్పె ప్రణయాలు
కరము తాకినవేళ, కదలాడె విరహాలు
చెలిమి తెలిపిన వేళ, ఎరుపాయె చెక్కిళ్లు
కను మరుగు నీవైన, కదలవు రే పగళ్లు!

నా బ్రతుకు వెలిగింప నడచి వచ్చిన సఖుడ
నీ వేగు దారిన, నే వెలుగు కాబోన,
గాలిపల్లకి లోన ఊరేగ ఊహలు
గగన వీధులలోన చేసేమ పయనాలు!!

నీలాల నింగి నిదురబోయినవేళ
నీ ఊసులే నా మనసు నిండిపోయినవేళ
గుసగుస ఈ గాలి మోసుకొచ్చిన తలపు
మిసమిసల వెన్నెలల తేలియాడెడి వలపు

ఈ రేయి మధురస్వప్నము బోలి
తెచ్చేన నీ కబురు, అలవోకగా తాకి,
వేయి వెన్నెలల వెలుగుల రేయి
చేయితాకిన, పులకించి కనుదోయి

రెప్పలల్లార్ప మదితాకు నీ చూపు
ఎద ఝల్లుమన వాలిపోయె నా చూపు
మనసు మధువనము చేయు నీ స్నేహము
మనసు తీయని వ్యథ పొందు మోహము

గాలి పల్లకి నెక్కి నేనేగ వధువునై
జగము వేలెడి స్వామి, చేకొనుము వరుడవై!!

మూసిన కనురెప్పల చాటున
ఊసుల చిత్రములు దాచి
బాసల నను పరితప్త చేసి
రాసేవు మనసు పుటల!

కలసిన మమతల త్రోవల
విరిసెను విరజాజి సుమాలు
రేయి గడచి, రేపు ఉదయించువేళ
గాలి పల్లకిలోన, నీ ముంగి చేరేన!

గగనంపు వొడి జారి నక్షత్రమొకటి
మెరసె నా ముంగిట, సడి లేని ఈ రేయి
మోసి నీ సందేశమ్ము, నా కడకు తెచ్చి
వ్రాసి పంపమని కోరేను బదులిచ్చి!

మొయిలు దారులు మూగవోయెనట
మూసిన నా మోవి నేడు పలుకనే లేదని
హోయలు చిలుక, నేడు మెరుపు మరచెనట
నిదుర భారాన కనురెప్ప తెరవనే లేదని!

పగలు రేయిగా నా పదమందు వొదుగ
పలుకాడని మౌనమే నిశీధియై
తెలివెలుగు రేకకై నీవు పరితపించేవని
ఇకనైన తారతో బదులంపమని!

గాలి పల్లకి నెక్కి నీ దరికి రమ్మని
చేరి నీ జతను మురిసిపొమ్మని!!

కన్నె కలువలు కనువిప్పెనదే
మిన్నులరేడు, వెన్నెలతొ కబురంపె నేడు
ముసురు చీకట్లు తరిమాడ, కోటి తారలతోడు
సరసి చేరునంట తాను, కోరి నా చేదోడు

చల్లగా లేమొ సన్నాయి పలికించె
మెల్లగా ననుతాక మేనంత పులకించె
సడిలేని కొలనులో సవ్వడులు రేగె
వడివడిగ నా ఎడద కథలెన్నొ వినిపించె

గాలిపల్లకినెక్కి ఊరేగ ఊహలు
చెలుని చేరగ వేచె చిన్నారి ఊసులు !!

# గరిక చివుళ్లు

మంచు తడిసిన గరిక చివుళ్లు
కథలు తెలిపెను రేపవళ్లు
నింగి ఊసుల మోసి తెచ్చిన
మంద పవనుని గుసగుసలు
రేయి పలికెనట నిదుర భామతో
కాసింతసేపు ఆగి రమ్మని
నెలరేని కబురులు కలువబాలతో
ఇంకను ముగియనే లేదని!

తారతెల్పెనట, మబ్బు అనెనట
దారి యిమ్మని, అడ్డురాకని
నింగి నేలెడు చందమామను
తనివితీరా చూడనిమ్మని!
ఉప్పొంగి యెగసే కడలి కెరటం
చప్పున తలవాల్చెనట మరి,
నిండు జాబిలి అందలేదని
మెండు ఆశయు తీరలేదని...

ఇన్ని ఊసులు, మరెన్నో బాసలు
మోసి, మోసి అలసిపోయి
మెల్లమెల్లన నేలతాకిన చల్లగాలి
గరిక చివుళ్ల యెద నొరిగె మళ్లీ !!!

## చెలిమి

చెలిమి పిలుపుల వినగ రాదొ
చెవొగ్గి నేడు, చెలుడనీవు
చెంగలువ యింట పేరంటమట
చెందురుడె వచ్చేటి అతిథి యింట!

నీహారికల తోడ నీరుజల్లించి
హరివింటి పసుపు కుంకుమలదిద్ది
విరజాజి పందిళ్ల నింపుగా వేయించి
మరుమల్లె వాకిళ్ల మందారముల చేర్చి
అందాలు చిందంగ అలరేను వాకిలి

డెందమ్ము పులకింప, తిలకించు ఈ సడి
విరులన్ని పిలిచేను విరితూపు విభుని
కలువబాలను నేడు కనికరింపుమని
గగనాల రేడెమొ గడియయే అగునని
ఆ గడియ, కలువ బ్రతుకంత విలువని!!

# పసి నిసుగ!

మూసిన గుప్పిళ్ల బ్రతుకు మర్మము దాచి
అరమూసిన రెప్పల కదలకనే మము చూచి
కిసుకున నవ్వేవు పసి నిసుగ నీవు
రహస్యమ? లేక పరిహాసమా తెలుపు.

చిన్ని చిన్ని వ్రేళ్లు విడకనే విన్యాసాలు
పొన్నారి పొత్తిళ్ల చిరుపాదలాస్యాలు
కన్నయ్య మెత్తని పెదవుల హాసాలు
జన్మజన్మల వేచిన నోము ఫలాలు.

జ్ఞాన యోగివలె కన్నులర మోడ్చి
చూసేవు. ఏ జ్ఞాన బోధ చేసేవు
మోహ తాపాల మునిగేటి మము చూసి
స్నేహాన చేయిజాపి, మందలించేవు!

# రాగలహరి

వెదురు పొదల యెదను వొదిగిన చిరుగాలి
అదరు పెదవులు తాక, అదియే 'పంతువరాళి'
చిగురాకు చివర, చినుకేదొ రాలి,
పలికె నీ వేళ, రాగాన 'రసాళి'

కనుచూపు కలవంగ, కదలాడె 'కళ్యాణి'
విరి తూపు తాకంగ విననాయె 'కీరవాణి'
మనసు పలుకరింప, 'మలయమారుతము' వీచి
మమత చిలుకరింప, అదియే 'అమృతవర్షిణి'

రాగాలు పొదిగిన అనురాగలహరి
ఊగేన ఊహల ఉయ్యాల 'ఆనందభైరవి'
స్వప్నాల లోకాల సరిగమల సందడి
శ్రుతి కలిపి పలికింప ప్రణవము ఎద సడి!

# ఎద దివ్వెలు

పువ్వు పువ్వు తన యెద నొక దివ్వె చేసి
వెలుగు తోరణముల తీర్చె నీ వాకిట నేడు
మంచు బిందువుల నీవు పంపిన పత్రమ్ము చదివి
రంజిల్లె రేకు రేకు రాగాన నేడు!

విశ్వ రచయితవు నీవు, వినిపింప ప్రణయాలు
కల్హార ముకుళములు కావ నీరాజనాలు
జగతి వెలుగులు వెల్లువై ప్రభవింప
జడిసి వెనుదిరిగె తిమిరాలు

పృథివి తన విన్నపము విరులతో వివరింప
చిరునవ్వు నవ్వేవు, చినుకులను రువ్వేవు
చిగురుటాకుల చివర చిక్కిన చినుకేమొ
పూ ఎదను దాగేటి మధువుగా మారేను.

# ఎద తునక

ఎద నుండి ఒక తునక విడివడి సాగునంటి
కదలు జీవన చక్రాల కాలగతి ఇదియంట
విడిపోని మమతల విడనాడు ఘడియంట
కన్నీటి ముత్యాల దాచి నవ్వేమంట!

'కన్నతల్లి'యని పిలిచేటి చిన్నారి
కదలి గడపదాటి ఏగేను తన దారి
దారి పొడవున ఆశీసు తోరణాల కట్టి
దారంట దాగేటి కన్నతల్లినిగాన!

చిన్ననాడు ఆటల్లో ఆడేము దోబూచి
ఈనాడు నీ దారిలో రాదమ్మ ఏ బూచి
కనులు మావి నీకు రహదారి చేసి
కాచేము మా తల్లి, కరుణాత్మనే వేడి!!!

## నీహారిక నివేదన...

ఇరు సంధ్యల నడుమ పదిలముగ ఒదిగేటి
నీలాల నీహారిక నా పరిచయమ్ము
సృష్టి చేసిన వేళ అందాల పొదిగి
నీలాల గగనాన పొందుగా ఆదరించేవు

రవికిరణము సోక మెరిసేన తనువు
ఇన కిరణము తాక మురిసేన అణువణువు
ముచ్చటగ నను చూచు ఓ విశ్వ రచయిత,
ఒక చిన్న మాట నీవేల మరచితివి?

తొలిసంధ్య వేళ నను పలుకరింప
వేవేగ వచ్చేను బాలభాస్కరుడు
నాతోనె ఎదిగేటి పొద్దుతో తానెదిగి
తప్త కిరణాలను పరితప్త చేసెను
ముగ్ధ మనసును నేసర్పితము సేయ
దయలేక తానస్తాద్రి చేరేను.

గుండె బరువున నే నీలి నీరదముకాగ
వర్షింప వలదని కబురంపె జాబిలి
ఇవ కిరణుడలిగిన విరహమ్ము వలదని
తన చంద్రికల నన్ను సేద దీరమని,

విరహాన రగిలేటి నా ఎడద బరువుని
స్నేహాన కలిసేటి తా చూడలేనని
లలిత యామిని లోన కలత తీరునని
జ్వలిత మానసమును తా చల్లపరుతునని

రేయంత నా చేయి విడువకే సాగి
దారంత వెన్నెలల పూవులే పరచి
రాగాన నా మదిని ఓదార్చు వేళ
మెలమెల్లన నేనాతని చెలిమికే కరగి

తన తోడుగా సాగేన అని తలచువేళ
ఉదయాద్రి ఎరుపాయె, తపమందు కననాయె
విడువలేనిది రేయి చెలిమి
విలువ నెంచ లేనిది పగటి కలిమి

రేయి పగళ్ల మీమాంసలోన
కలత చెందుట ఏల నా విధి?
సకల విశ్వము రచియించినావు

ఒక్క మనసుకు ఎన్ని తలపులు
ఒక్క తలపుకు ఎన్ని వలపులు
ఒక్క వలపునకెన్ని భావములు
ఒక్క భావనకెన్ని రాగములు!

ఇన్ని ప్రశ్నలు, ఎన్ని ప్రశ్నలు
ప్రకృతి నిండుగ ఎన్ని ఊహలు
అన్ని కలబోసి నే కలవరమందినను
నీలాల నింగికే అందాన్ని నేను

విరహాన వర్షింప ఉనికి యే కరువగును
చెలిమి చేకొనకున్న మనికి బరువగును
కాన ఇనచంద్రుల ప్రేమ వాహినిలో
ఊగేటి నీలాల నీహారికను నేను.

## చెలికాడ!

కొలనులోని కలహంస కనువిప్పి చూసేను
అల చెలికాని జాడ కనరాక వెదకేను
కలువ మాటున దాగేన, దోబూచులాడేన
కలవరపరచనను, కనుమాటు మరిగేన!

నీలిమబ్బు కురిసేను, నేలగరిక తడిసేను
నీటి ముత్యాలు కురవ, కొలనంత కదిలేను
ఉరుము జడిపింప నా ఎద కలగేను
కరము చూపి వెదికిన, సఖుడు కనరాడాయె.

కరుణ ఎదనుప్పొంగ, మావిరహాల వివరింప
పలుకు తేనెలు చిలికిన వాల్మీకి కవిగాక
జంట విడిన హంస వంటరియె కాద
వెంట సీత లేదని రామయ్య వగచెకాద!!

# ఒడివీడి

నీరెండ నీడన నిలచిన నెలత
కన్నీరు చిందగ కనుదోయి మూసేవు
నీ నీడ వదలి ఏగేను, వొడి వీడి
నీ కంటి పాపగ వెలిగేటి ప్రతి రూపు

నవ్వుల్లో పూసిన వెన్నెల్ల పూలు
సరాల కూర్చి నీ ద్వారాల వేసి
అలరించి ఎదను మధుకలవము చేసి
బతుకు బాటకొక అర్థమ్ము తెలిపి
తమ బాట వెతికేరు చిన్ని కూనలు నేడు

రెప్పల్లో దాచి, గుండెల్లో కాచి
నొప్పి తెలియకుండ, గాయాలమాన్చి
నిలచి చూసేమ కనులింత చేసి
విశ్వ విభుని లీల, అచ్చెరువున కాంచి!

## విరజాజి విభుడు

అరవిరియు విరజాజి చిరునగవు మాటున
దొరలె ఊసులెవొ, ఊహల్లొ దాగి
విరయు ఎద తెలుపు కథలన్ని వినబోన
వినపడని సడులేవొ మది తాకి నటులాయె.

తోటి చెలులు వేచేటి, తేటి చెలుడువలదని
మూగగా ఒకవైపు దాగుండె విరజాజి
అల్లంత దూరాన ఆలయమ్మొకటుంది
ఆలయపు నడుమ నిలచేను తన పతి.

ఆది దేవుడనుచు ఆచారి కొలిచేమ
ఆ దేవునే తాను ఆరాధించేను
విశ్వవిభుని కొరకు, విరిసేను తాను
విశ్వమంతా అతని మ్రోల వాలేను
విశ్వమే నిదురించు వెన్నెల్ల వేళ
విశ్వాత్ముని చేర తాను బయలుదేరేను.

వంటరి తానేగ, తన విభుని చేర
మలయపవనుడు తోడుగా వచ్చేను

తార దీపాల రహదారి వెలిగించి
ఆలయ ద్వారాల తాముగా తెరిపించి
చిరునగవుల స్వామి చేయనందింప
కరగి అతనిలో కలసిపోయెను!!

## ఆవేదన

అంతరాంతరము నుండి ఆవేదనొకటి వెలువడి
అవని యంతయు నిండె ఆర్తనాదమ్మై
అలవోలె చెలరేగి కలలన్ని చెరిపేసి
నిలచిపోయె నేడు కరగని శిలవోలె.

చేయంది, జీవన పథాన తోడిచ్చి
చేయి వదిలి నీ వేగితివి, నాకిక తోడేది?
కలకాలము కలిసుందమని బాస చేసి
కలసిపోయితివి కనరాని గగనాల నేడేమి?

కన్నులేద్వగ లేవు కలతబారినను నేడు
మిన్నులన్ని చూచె కన్నులింతింత చేసి
కరగని మంచుశిలగ మారె కన్నీళ్లు నేడు
కరగిన, ఆ కన్నీట ఈ పృథివి మునిగిపోద!

ఒక స్నేహితుని స్మృతికి....

## తెలుగు వెలుగులు

ఎదలు సొదలు తెలుగు కథలై
కదలి పలికెదు అలల సుధలై
తెలిపె నవిగొ తేట తలపులు
తెలుగు పలుకుల తేనె పిలుపులు.

పాపికొండల పొత్తిళ్లల్లోన
కనులు విప్పిన చిన్ని గోదారి
తల్లి శబరి కరము చేర్చ
కరగిపోయె రామన్న దరిని

కలికి కావేరి కన్నులరమోడ్చి
కడిగేను అటుచూడు శ్రీరంగ పాదాలు
కనుల కాటుక కరగి విభుని చేరంగ
నళినాక్షు మెరపు నీలిమేఘమాయె.

కృష్ణమ్మ పలికేను ఆ జగన్మాతతో
కురులు జార్చవమ్మ కనకదుర్గమ్మ
నా చిగురుటలల దిద్దేన అలకలు
చిద్విలాసమ్ముగ, చిందంగ అందియలు

తుంగభద్రగంగ ఉప్పొంగి పోవంగ
మురిసి చూసేన మంత్రాలయమ్ము
అండ చేర్చి, ఆర్తుల కభయమందించి
ఆంధ్ర దేశమలరార, ఆశీస్సులిచ్చేను

కృష్ణమ్మ కలకలలు, కావేరి గలగలలు
గోదావరి తల్లి గంభీరగతులు
పెన్నమ్మ పలికేటి చిన్నారి కవనాలు
కలిసి తెలిపేన తెలుగు కథనాలు.

# జయతు జయతు

జయతు జయతు ఓ తెలుగుతల్లీ
జయతు జయతు ఓ కల్పవల్లీ
జయతు జయతు నవ్యాంధ్ర దీప్తినీ
జయతు జయతు సకలాంధ్ర వ్యాప్తినీ.

మెల్లమెల్లన నీ వరుదెంచగ
ఘల్లుఘల్లున మోగె అందియలు
నాట్యమాడెను లలిత ఇందిరలు
ఎగసి దూకెను గౌతమి కృష్ణలు.

వెలిగింపుము మా సభల దివ్వెలు
తిలకింపగ నవ్యాంధ్ర దీప్తులు
మెరసినవె చూడు యువతా స్ఫూర్తులు
నవ సహస్రాబ్ద సంప్రాప్త దీప్తులు.

## వలపు వెన్న

కొసరి కొనగోటి చిగురునంటిన వెన్నపూస
మురిసి నేనును మోవి కందించ వెన్నుడ
సరసాన రాధ చెక్కిలి ఎరుపు చేసి
పరుగున ఎటొ దాగితివి నేడు నందగోపుడ!

చితికి, తన ఎద తరచిన ప్రేమామృతము
కలికి నీ కందింప, కరుణ చూపవదేల?
మలిపొద్దు గడచి, జాబిల్లి పిలుచువేళ
మరి ఎచటొదాగి రాధను ఒకింతువేల?

పూచె పున్నాగమ్ము, నిట్టూర్చే కిసలయము
తోచె తూరుపున తొలి సంధ్యారాగము
వేచె రేయంత కనుమూయకనే రాధ
కాచి నీ సఖియ, పలికింపు ప్రణయగాథ

భువన మోహనమైన నీ మురళిలోని
రవము కాద రాధ మధుర భావము
తొలిగి వెలుగు కన్నయై రాధనర్తింప
వెలిగేన నీ వలపు విశ్వమె పులకింప!

# రామకృష్ణ

తెలుపలేనిది, తీయనైనది మురళిమోహను ప్రేమభావము
పలుకుకందక పృథివి నిండినది రామచంద్రుని భక్తి భావము
పదము పల్కిన మధువొల్కునేమొ
ఎదను తరచిన సుధ చిల్కునేమొ

పదము పలికీ, ఎదను చిలికిన
మధుర మూర్తి మరి కనులనిండునొ

కృష్ణ యనిన కన్నులరమోడ్పులగును
'రామ'యనిన రసన యట్లె నిలుచును
రామకృష్ణుల నామామృతము సోకిన
ఎడద కడలియై పొంగి పొరలును

పొంగి పొరలి, నింగి చేరీ
కరుణమూర్తి కడ మోకరిల్లీ
కనులు మూసిన, భావ బాష్పాలు జారి
పులకరించిన పుడమి కలసిపోయె
మరి ఆవిరైన అస్తిత్వమేది?
ఆకృతి లేని అనుభూతి ఏది??

## ప్రకృతి పలికేను

అదిగదిగొ అదిగొ అల్లదిగొ చూడు
ఆమని వచ్చేన, విరులన్ని విచ్చేన
పచ్చ పచ్చని ఆకుల చీరలన్ని వేసి
అరవిచ్చు అలరుల అందాల కలబోసి
అరుదంచె నదె చూడు ఆమని నేడు
అచ్చెరువున ఈ జగతి కనువిచ్చె చూడు!

చిన్నిచిన్న ఆకులార
చిన్నారి రేకులార
ఆకుపచ్చని వలువలివిగొ
గోరువెచ్చని వెలుగులివిగొ
నింగి నేడు కనులు తెరిచెను
చందమామ నిదురబోయెను
నీలిమబ్బుల తెరలు తొలగ
వెలుగు బాలలు నాట్యమాడెను

నిన్ననేమొ మోడులమ్మ
నేడు పూవుల బోడులమ్మ
ఆకు తొడిగిన రెమ్మరెమ్మ
వేకువిచ్చిన వరములమ్మ

# మబ్బులు

నింగి దారుల దాగెనవిగొ
తొంగి చూచెడి మేఘమాలలు
ఆకశమ్ము దోసిలొగ్గి
నిలిచి మెరసే నీలమణులు.

నీలాల నింగి వొరిగి నేడు
అవని అంచుల తాకె చూడు
చేలాల చాటు చిన్ని నవ్వుల
దాచు కన్నెల చెలువమ్ము బోలు.

మేను విరిచిన మెరుపు తీగెలు
నేల జారెను, అవిగొ చూడు
వాలు కన్నుల, చిలిపి కన్నెలు
జాలువార్చిన, వాడి చూపులు
జాలువార్చిన వాడి చూపులు
అవియె కావా మరుని తూపులు!

# పక్షులు

శుకములార, పికములార
రండు రండు, తరలిరండు
చిన్ని కూనలార, తేనెసొనలార
వెన్నెలల దారులివిగో
క్రొన్ననల తేరులివిగో

ఆకశాన ఎగురు వేళల
నింగి తారల తాకువేళల
తెలుపురండు, తెలిపిరండు
వచ్చెనామని చూదరండూ!!

## పూవు పుట్టుక

మంద మందపు నగవుతోడ
మందహాసపు బిగువుతోడ
మందారమొకటి మొగ్గ తొడిగెను
డెందాలు ముదమున పొంగిపోయెను.

అందాలు చిందేన, ఆ చిన్ని సుమము
సంజాయ కెంపుల కలబోసె, కనుము
చిగురుటాకుల సోదరుల నడుమ
తొగరు దారపు సోయగాలు

మొలక నవ్వుతొ తల్లి వెనుక
చిలకరించెను సరాగాలు
రేకు విరిసే తరుణమాయెను
చేరదీసిన తల్లి పలికెను

నా వొడిన విరిసిన చిన్నిపూవా
నిలచి విను, నాకంటి వెలుగా
కలలెన్నో చేర్చిన కంటిపాపవు
పూజకు పూసిన, చిన్నపూవు!

నీ తోటి చెలులేమొ నిను చూచి పిలచి
తమ తోడు రమ్మన్న, వినబోకు నా తల్లి
కొంటె కోణంగుల జతగూడి ఆడేవ
కన్నీటి ధారలుగ కాబోద బతుకంత?

పూజకై పుట్టిన పూబోడి వీవు
పరమేశు పాదాలె పరమావధి మనకు
నీతులెన్నో తెలిపి, నిట్టూర్చె నా తల్లి
కథలన్ని వినిగూడ, చెలుల చేరెనా తవ్వి!

చెంగు చెంగున దూకులాడే
రంగురంగుల కోక మార్చి
ఎగిసి అల్లరుల రభస చేసే
ఎర్ర గులాబీ బాల నేను.

ఇదిగొ నా చెలి, ఇదియె మొగలి
కలసి ఆటల గేలిచేసి
తోటనంతా చెలగిరేగి
తేటి బాలుర గోల చేసీ
ఆటలాడే సమయమాయె,
అని పలికి, మందారపు చేయిపట్టీ

కలిసి ఆడిరి కలిసి పాడిరి
తమను మరచి, తనువు మరచి.
అంతలో, అదియేమి తాకిడి?
పెనుతుఫానుగ ఏమి అలజడి?

తల్లిమాట వినకపోగి
దూరతీరపు బాటనేగి
దారితప్పిన పూలబాలలు
దారి తెలియక, వెదుకులాడిరి.

చుట్టు ముట్టెను తేనెటీగలు
చుట్లు చుట్లుగ పూలచుట్టు
దిక్కుతోచని గులాబిబాల
ముళ్ల మాటున దాగె చూడు
తనను రేకుల కలిమితోడు
ముకుళించి పోయె మొగలి చూడు!

కడుదీనమై కలత చెంది
వాడిపోలె మందార బాల
కరుణలేని లోకమమ్మ

కన్నవారే రక్షణమ్మ
బుద్ధి తెలిసెను కాచవమ్మ
మరల ఇటుల చేయనమ్మ.

వెతకి, వెతకి వేయికనుల
కన్న కూతురుని కన్నతల్లి
పరుగుపరుగున పయనమాయెను,
ఎదను చేర్చగ తన చిన్ని కూనను.

కరుణ చూపుమయ్యా, కరుణాల వాల
తరుణ ప్రాయమయ్య, కరుణించవేల
తెలిసి చేసిన నేరమే కాదయ్య స్వామి
చేరదీసి ఈ బాలను కనికరించవేమి?

నీ పూజకోసమై కనుతెరిచే నీ పువ్వు
నీ పాద సన్నిధి, అర్పించనిమ్ము
తలిరాకు తల్పాల వీడనే లేదు
మలిపొద్దు మాపింక చూడనే లేదు

అని తల్లి శోకించె
తరులన్ని తిలకించె
ఎద కరగి, పరమేశుడా
కలత తొలగించె.

కనువిప్పె మందారము
పులకించె ఈ జగము
కనుదోయి తడియార
పూజించె నా సుమము

చిన్నారి బాలలార
చిన్నిచిన్న పూవులార
తల్లి మాట, తండ్రి మాట
కాద మనకు పూలబాట

ఈనాటి ఈ పాట
తరతరాలకు సుమబాట
తెలిసికొందు, తరలి రండు
వచ్చె ఆమని, ఇక మన కలలు పండు.

# ఎదగళము

ఎదగళము సవరించె
సుధలొలికి వినిపించె
చిరుమావి చివురేదొ
చిన్ని కథ వివరించె

తెరమరుగు వెలుగేదొ
తెరతొలిగి ప్రభవించె
ఒరసి గల్లు నరసి,
స్వరమేదో ప్రకటించె

ప్రణవమై తొలిపలుకు
అణువణువు పులకించె
పరమేశు పాదాల
కుసుమమై వికసించె.

# శిశిరం

ఆకులడిగేనవిగొ, అయ్యో ఆ మోడులు
ఆకశమ్మువైపు, అతి దీనముగ చూచి
ఆచ్ఛాదనయ లేని, ఆకృతులను బడసి
ఆక్రోశించేనయ్య, అవనీశ దయలేద?

కనుల నీరు నింప, అవిరయ్యే అశ్రువులు
తనువు చాలి దాచ, ఆకులేమొ రాలె
ఎటు తోడులేని ఎడారి మిగిలేన
ఇటు నీ కరుణ కాసింత యిడవేల?

నవ వసంతములోని తలిరాకు లేవి?
నవ జీవనంపు కుసుమాల సడియేది?
నవ వధువులోని తొలివలపులేవి?
నవత లోపించు ఈ శిశిరమేమి?

ఇక చాలు ప్రభూ ఈ మోడు శోకాలు
ఆర్పరావేమి? ఈ తిమిర దీపాలు
వెలిగించి, బతుకుల వెలుగులు జోడించి
నవ వసంతపు తేరు వేవేగ తేవేమి??

# వసంతం

క్రొన్ననలు కన్నువిప్పిన వేళ
వెన్నెల రేకుల విరిసినట్లాయె
కన్నెల మదిని దాగు వెన్నుడీ వేళ
వెన్నవంటి వలపు దోచినట్లాయె

వ్రేపల్లె మాపులో యమునమ్మ దాపులో
రాజిల్లు రాధమ్మ క్రీగంటి చూపులో
మురిసిపోయే మమత జల్లులు

విరిసిపోయే రాసలీలలు
తెలిపెనవిగో చూడు, సరిక్రొత్త ఊసులు
సరిగంచు సవరించు, గోపమ్మ బాసలు.

## కొంగెక్కడే నీది
## కొమ్మరో నేడు...??

ఓ సిన్నదాన,

మావిసిగురు కోకకట్టి
సింతపూల రైక తొడిగి
బంతిపూలు సిగను సుట్టి
ఇంతలేసి కళ్లతోటి
గుండెలాగె, సోకులాడి
ఏమైతివే, నీవు ఏడుంటివే?

పిల్లగాడిని కొంగు కట్టె
దీని సోకు సూడరండి
అన్న మా యమ్మ నోట
ఒక్క మాట లేదు...
పిల్లకేసి సూడ కొంగులేదు
కోక లేదు, సోకులేమొ
సుట్టసుట్టి, పాంటు కట్టి
షర్టు చుట్టి, టక్కు టక్కు నడుసు పిల్ల
దానికేసి సూసి అట్టె ఆగె నా గుండె గుల్ల!

కొండ మెట్లన్ని
నీ కొంగట్టుకెక్కువేళ
కొంగులేని సిన్నదాన

ఒక పెద్దమ్మ ఉవాచ...
అతివల అందాలకి
అంచులున్న చీరకట్టి
అంతపొడుగు కొంగుతీస్తే
అర్థమేమిటమ్మ, నే చెప్తా వినరమ్మ....

అలనాడు అలిగేను సత్యభామ
కొంగుపరచి నేల, పవ్వళించె కోపగించి
అదె కొంగు బిగించి, నరకుని వధియించి
ఇచ్చె మనకు దీపావళి, తరతరాల శోభావళి.

చూపరమ్మ చిన్న తల్లులార
కొంగు ఉయ్యాల కాద చిన్ని తండ్రికి
కొంగు బంగారమయి నేడు
ఊగెనద చూడు, బుజబుజల బుజ్జిగాడు.

కురిసి కురిసి వానజల్లు
తడిసిపోయె చిన్ని వొళ్లు
చెంత చేర్చి తలను తుడిచి
ఆరవెయ్యి ఆ కొంగు.

ప్రేమతోడ, భక్తితోడ, ఆరాధన శక్తితోడ
అన్ని రంగాల దూకె నతివ, అబ్బురాల కొంగు తోడ!

అయ్యో తల్లి నేడు చూడు, ఎటు వెదకిన కొంగులేదు
...... కొంగు లేని, కొమ్మదో నీకేది తోడు!!

# సంక్రాంతి

"సప్తాశ్వ రథమారూఢం, ప్రచండం కశ్యపాతజం
శ్వేత పద్మధరం దేవం, తం సూర్యం ప్రణమామ్యహం..."

తెల్ల తెల్లవారవచ్చె
బంతి మొగ్గ రేకువిచ్చె
రంగవల్లి తీర్చ నేడు
సందె తల్లి వచ్చె చూడు...

చలిగాలి గిలిగింత పెట్ట
భోగిమంట వెయ్యి ఇపుడు
కలిమి తోడ కళ్లాపి జల్ల
కళ్లు విప్పె వాకిళ్లు నేడు
పసిడి వెలుగుల పరవశాన
పసుపు దంచెను రోకళ్లు... ఆహూఁ... ఆహూఁ....

"సుబ్బీ గొబ్బెమ్మ, సుబ్బడి నియ్యావే
మొగలి పువ్వంటీ, మొగుడు నియ్యవే"

కన్నె పిల్లలు కలలుకనే
సందె గొబ్బి పాట విను
వెన్నెలొచ్చి నిలుచువేళ
వెన్న దొంగ మాట విను.

డూడూ బసవన్న
ఒక్క మాటు ఇటు రారన్న
అయ్య వారికీ దండం పెట్టు
అమ్మగారికీ దండంపెట్టు
ఏలినవారికి వొద్దు దిగుళ్ల
పాడిపంటలు నిండును బళ్లు.

పుత్తడి బొమ్మలు
ఈ కన్నెలకును
పుప్పొడి గంధం
పూసే దెవ్వరొ?

జిలిబిలి నవ్వులు, విరిసిన పువ్వులు
నలుదిశలకును జల్లేదెవ్వరొ?
కొత్త అల్లుడు వచ్చెను నేడని
ముత్తెపు నవ్వులు విసిరె దెవ్వరొ!

భోగిమంటలు, గొబ్బి పువ్వులు
గంగిరెద్దులు, హరిదాసులతో
అంబరమంటే ఆనందాలతో
సంబరాల సంక్రాంతి యిదమ్మ
వచ్చేనమ్మ, వచ్చేనమ్మ
పెద్ద పండగా వచ్చేనమ్మ....!!

## వెదురు పొదల వెన్నెల

వెదురు పొదల దాగు ఓ వెన్నెలమ్మ
అదరు గా ఎదసడి విన రావమ్మ
అడుగు పడదు విభుని తలపు దరిన
వడివడిగ ఎద పేగు, తనువచటె నిలచు

కనులేమొ అరమోడ్పులు
తలపులు విరితూపులు
కలలేమొ కర్పూర గంధులు
పొలతి పదాలు, ప్రణయ ప్రబంధాలు

ఉసురుసురను ఊర్పులు
పసిడి ఊహల చేర్పులు
నిశి ఊసుల కూర్పులు
సఖు చెలిమి నేర్పులు

# మురళి రవళి

అలలు అలలుగ సాగె ఆ మురళి రవళి
కదలి తరగల తేలు వెన్నెలల సరళి
కదలి వచ్చిన పాలకడలి దారి
వెడలె తారల తోడ వెండి జాబిలి

మనసు మీటిన స్వరఝరి
మరులు రేపిన మాధురి
కదలు మలయుపవనుసడి
ఎదను ఒదిగిన అలజడి

మురళి పిలుపుల మధురిమలు
పుడమి విరిసిన వెన్నెలలు
మొయిలు తేరుల సోయగాలు
కదలి జారెడి పువుల వానలు.

# చరమాంకం

తరులతల ఛాయల వొదిగి
తలపు తీవెల పూల దోగాడి
తరుణి యొక్కతె పెరిగె
రాసిరుల నెలవులో

పెరిగినది ఆ తన్వి
పెరుగు మీగడలతో
పెన్నిధి వలె చూచు
పెద్దల మురిపెముతో.

తరుణ ప్రాయముననే
'తన'దన్న దెరుగక
పరులకొరకే తాను
పలు విధముల చింతించె

సాగిపోయెడు జీవన యానము
తోడు వచ్చిన చెలుని స్నేహము
ఒడిదుడుకుల రహదారిలో
బదలిన మానస యానము.

ప్రభవించిరి పంచకన్యలు
ఆనందామృత రసఝురులు
కనుల వెలిగేటి కన్యలకు తోడు
ఆయింటి.... అన్నదమ్ములిద్దరు.

కాలమాగలేదు, కలలు నిలువలేదు
నిజమిదని తెలిపిరి
కదలి వచ్చిన మనసులు
వారితోడుగ మనుమరాండ్రు.

కదలి ఆ జీవన రథము
వదలె 'తన'దన్న సౌధము
తిరిగి రాలేని దూరాన చెలుదు
వెన్నండి పోలేని దీర్ఘ పయనాలు.

మనసు పరుగులు మానదు,
తలపు తలుపులు మూయదు
కరిగి వొంటరి బ్రతుకున
కనుల నీరు తరుగదు.

సుడులు తిరిగెడు వ్యధకు
ఆవిరయిన అశ్రువులు
పలుకలేని బాధకు
పలుకాడలేని తనువు

తనువులోని అణువణువు
ధారపోసిన బ్రతుకు
కదలిక లేని కాయము
కదలగ లేని జీవనయానము

విశ్వరచనసేయు విశ్వేశుడు వీవు
నీ ఈ వింత చర్యకు వివరణ తెలుపు.

రచియించు నీ తూలిక
ఒకింత వణకి తూలినది?
కదలిక లేని మనికికి
నిలకడలేని మనసదేమి?

ఇది నా భావబంధమయిన
మన్నింపు నా స్వామి
భవబంధముల ఛేదించి నేడు
నా తల్లినిక కరుణింపవదేమి??

# చుక్కలార

చుక్కలార చుక్కలార
చక్కనైన అక్కలార
ఒక్కసారి దిగిరండి
ఒక్కమాట వినరండి

చిక్కనైన తలపుల్లో
చిక్కుకున్న కలలండీ
నిక్కిచూచె జాబిల్లి
చక్కనైన చెలుడండీ

ఆకసాన పాలపుంత
వెలుగుతోట దారి చెంత
నీలిమబ్బు నీడలోన
ఆడంగ దోబూచులాట!

# నాదఝురులు

అణువణువొక అక్షరముగా
ప్రణవపదము పరిఢవిల్లగ
పరమశివుని పదము కదలి
రజతనగము పరవశించెను

పలుకు పలుకు చిలుకు మధువు
పదము పదము పరమ పదము
నిటల నయను కరుణ ఘనము
జటిల నృత్యము జగతి వరము

తుదియ మొదలు లేని సృష్టి
భవుని కనుల కరుణ వృష్టి
కురిసి విరిసె రాగహేల
మురిసె జగము మధురలీల

అందెలల్లన అందముగ మ్రోగ
సందెమెల్లన అరుదెంచువేళ
గంధపుపొడి చిలికింప ధూళి
డెందముప్పొంగ చెలరేగె కేళి

నర్తించె నీలాలగగనమ్ము నేడు
నర్తించె రాగాల భువనమ్ము చూడు
నర్తించె స్నేహాన వెన్నెలల రేడు
నర్తించె మోహాన వెన్నతినువాడు.

ఇటు కదిలె రాధమ్మ
అటు కదిలె గోపమ్మ
ఎటు కదిలి నాడమ్మ
ఎటు వెదికి రానమ్మ?

వెదురు పొదలను ఒదిగినాడ
అదరు పెదవుల వంశి నదిమినాడ
బెదరు మనసుల సదరినాడ
చెదరు మమతల పొదవినాడ!

యమునమ్మ పిలిచేన
మధుపమ్ము వలచేన
నందనమ్ము పులకింప
బృందవనము తిలకింప

# కలలలో

మూసిన కనురెప్పల చాటున
ఊసుల చిత్రములు దాచి
బాసల నను పరితప్త చేసి
రాసేవు మనసు పుటల
కలసిన మమతల త్రోవల
విరిసెను విరజాజి సుమాలు
రేయి గడచి రేపు ఉదయించువేళ
తెలి వెలుగు రేకగ నీ త్రోవ వెలిగేను.

# పున్నమిరేయి

నీ పెదవుల మధురిమ నందిన మురళి
పులకితయై వినిపించిన జీవనసరళి
సడిసేయని సరిగమల ఎదసడి
నడిరేయి సెలయేటి అలజడి

కురిసే వెన్నెల వెలుగుల
మెరిసే మోవి నగవులు
పెదవి దాగిన పగడాలు
పొదవికొన్నవి రాగాలు

శ్రుతి కలిపిన గీతాల
జత కలసిన భావాలు
లయతప్పని పాదాల
పెనవేసిన లాస్యాలు

పులకించెను పున్నమిరేయి
తిలకించెను గగనపు కనుదోయి
నీల మోహన నీకు నేనర్పణముకాగ
ఈ రేయి మన ప్రేమ దర్పణము కాద!!

## ప్రణయహేల

పలుకున విరిసిన మమతల సుమములు
తలపున కురిసిన ప్రణయపు చినుకులు
కలసిన మనసులు అరసిన నిజములు
సరసిజ దళముల తుహినపు కణములు

కలసిన కరముల తెలిసిన వలపులు
గడచిన గతములు తెలిపెడు కబురులు
కరగిన క్షణములు కరగని నిజములు
కనియెను గగనపు మెరుపుల తళుకులు

కురిసెను అపుడవి వెలుగుల సేనలు
మనలను కలిపెడు మమతల బాసలు
మనసున ఎగసెను యమునపు తరగలు
మురళిలొ పలికెడు రవళుల మధువులు.

## పద్మావతీ శ్రీనివాసం!!

పాలకడలి పవళించు నెలరేడ
నీల గగనపు తునకనెడి బాలుడ
ఆల మందల కాచు ఆర్తరక్షకుడ
కేల జగము నాడించు కీర్తిఘనుడ!

ఎవరు నీవు తండ్రి? నీకెవరు తండ్రి
తల్లిదండ్రులు లేని తనయుడ వెట్లు
తల్లి యశోద యట, ఆమె వకుళయట
కన్న దేవకి ఎవరు; నిన్ను కాచినది ఎవరు?

దేవకి కథవింటి, వసుదేవు వ్యథవింటి
నందగోపుని చిలిపి శిశువునగంటి
యశోదమ్మ కొంగు నిధి గూర్చి వింటి
వెన్న పాలను దొంగిలు వెన్నదొంగనుకంటి.

గోపమ్మ సరిగంచు గుసగుసల వింటి
రాధమ్మ నయనాల మిసమిసలు కంటి
నంద వ్రజము నినదించు వేణురవములు  వింటి
సుదాముతో చెలగు చిలిపి చేతలకంటి!

అన్నమయ్య పదములోని అలివేలు మంగపతిన
త్యాగయ్య కృతులలోని జానకీ పతివ
క్షేత్రయ్య తూలిక జారిన మువ్వగోపాలుడవ
నా మనసున వెలసిన శ్రీ వేంకట పతివ!

రూపులెన్నైకాని, రూపమే లేదట
పేరులెన్నెన్నైన కాని, నామమే లేదట
నామరూపులు లేని నామాల వాడివట
నోము నోచిన వకుళ వరాలమూట!

పద్మనాభుడట, పంకజాక్షుడట
వకుళ తనయుడట, వేంకటేశుడట
సప్తగిరుల నేలు, శ్రీనివాసుడట
పద్మనయని, పద్మజ విభుడట!

చెంపల కెంపుల సంధ్యలు విరియ
కంపితాధరమున తేనియదాగ
గగనపు టేలిక తనయ యేగె
తొణకని మధు కలశము వోలె

జన్మజన్మల బంధమేమొ
మన్మథ జనకు వలచె తల్లి
వకుళ నోములవి సఫలముకాగ
శ్రీహరి మది విరిసె పాలవెల్లి

కలయగ కనులు విరిసేను కలువలు
తెలియగ మనసు మురిసెను జగములు
జగమేలు స్వామికిని, జగన్మాతకును
మరియొకపరి మంగళా శాసనము

పరితపించు పడతి కొరకు
పదధ్వనుల కులికి పడును
పికము పలికిన తరుణి పిలుపని
చిలుక పిలచిన కలికి వలపని!

నిఖిల జగముల కేల నిలిపెడు
అఖిల భువనము లేలు ఘనుడు
మరుని శరముల మధన పడెన
మరుని జనకుడె మనిషి వలెను?

కలికి యచట పలుకదాయెను
ఫలము పుష్పము తాకదాయెను
కనులు తెరిచియు కలలడోలలు
కదలి ఊగెను కమలకాంతయు!

ఇది ఎచటి వింత ప్రణయము
ఆదిపురుషునకేల విరహము
ఆదిలక్ష్మియె తరలి రాగ
ఏల జరుగదిక పరిణయమ్ము?

తరచి చూచిన తల్లి మనసుకు
తెలిసి పోయెను తనయు తపనము
తోడ మునివరు తోడ్కొని పోయి
కోడలి కొరకు రాజు నరసెను.

ఏలగ, రాజ్యము లేని మారాజు మావాడు
చేత కాసులేని సిరుల రేడు
కోర వచ్చితి నీ కలిమి మూటను
చేర తనయు దరి బ్రతుకు బాటను

సిరి సురమున దాల్చు శ్రీనివాసుడు
కరి రాజు బ్రోచిన ఘనుడు వాడు
అల శబరి ఫలమందు కారుణ్యమూర్తి
ఇల నంద గోపుని ఇంటి దీప్తి!!

నీలిమేఘపు ఛాయ, నిలువెల్ల దయకాద
కాలుమోపిన చోట, వికుంఠిపురి కాద
కేల చక్రము తాక, నశియించు పాతకము
మ్రోల ఆతని నిల్వ, తరియించు జీవితము

కాన, నీ 'సిరి'ని శ్రీపతికి యిమ్ము
పద్మావతికి చేయు పరిణయమ్ము
అని పలికె వకుళ, పుణ్యచరిత
గగనపు టేలిక మది ధన్యమయినంత!

ఇంత తడపు విరహమోపలేక
ఇంతి మనసు గిలిగింతలిడగ
సోది చెప్పగ వెడలె సోమాంతకుడు
చేరి చెంత నుడివె ప్రేమభాషణలు

తరలిరాగ, దేవ కిన్నెరలు
యక్ష సిద్ధులు, గగన ప్రసిద్ధులు

కాసు కొలుచు కుబేర ప్రభులు
కూడి ఘనముగ వేయి సేసలు!

ఆకాశమంత పందిరేసె ఆకాశరాజు
భూలోకమంత పీటకాన భూమిసుతకు
వందిమాగధులంట, వైతాళికులంట
వేద విశ్వవిభుని వేంచేసె వేల్పులు!

జగన్మాతకును, జగత్పతికిని
జరిగె పరిణయము, జగత్కళ్యాణము
మరలమరల విన్న మరింత మధురము
మంగళ భరితము పద్మావతీ శ్రీనివాసము!!

చెలియ వెసెనపుడు చేమంతి బంతి
నళినాక్షుడాడె కలువ బంతి
సఖియ చేయి జాచ దొరలె పొగడ బంతి
విభుడు కేల జార్చె విరుల బంతి

ఆడిరటుల వారు బంతులాట
సకల జగములూగ వలపు సయ్యాట
పూర్ణ పురుషుని చెలిమి విరితోట
పద్మావతి జతగ చేరిన పూలబాట

## సమర్పయామి!!

సఖ్యం సాందీపనీ గురుకుల వాసం
ఇందీవర శ్యామ శరదిందు హాసం
సఫలిత జన్మం, సలలిత మధురం
వందే శ్రీకృష్ణ కుచేల సఖ్యం!

దాసత్వం దాస హృదయ స్థితం, దానవ మర్దనం
మారుతీ సేవితం, మానినీ రక్షకం
పావన మునిజన వందితం
పవనజాత్మ పూజితం
రఘుకుల దీపం, హనుమ దాత్మ స్వరూపం.

సేవ నయనం సజలం, గాత్రం గద్గదం
కంపిత దేహం, ముకుళిత హస్తం
శబరీ సమర్పిత ఫలమతిమధురం
సేవాతత్పరం, శబరీ కథనం!

చింతనం శ్రీనాథు చింతనం, ఉచ్ఛ్వాస నిశ్వాసం
అముక్త మాల్యదం, గోదా జీవనం
విష్ణుచిత్త తనయ హృదయం, శ్రీహరి భరితం
శ్రీహరి హృదయం, నవనీత సదృశం

వందనం భావం రామమయం, హృదయం సాకేతపురం
భాషణం రామపదం, భూషణం రామస్మరణం
దేహం రామనిలయం, గేహం రామపథం
త్యాగరాజ సర్వం, సర్వస్వం రామం!!

సంకీర్తనం కందర్ప జనకం, ఘనపద్మనాభం
సుందర స్వరూపం, సుమధుర భాషణం
తిరుమల నివాసం, లీలా విలాసం
వేంకటేశు కీర్తనం, మధురాతి మధురం

అర్చనం పాండ్య రాజకృత యజ్ఞ ప్రసాదం
సుందరేశ విభు రమ్య హృదయస్థితం
మధురపుర నివాసం, మందస్మిత వదనం
కుంకుమార్చిత శోభితం, శక్తి స్వరూపం!!

శ్రవణం శ్రవణ కీర్తన సారం హరినామ స్మరణం
శ్రవణ వేద భాష్యం హరి దివ్య రూపం
శ్రవణ మాధుర్య భరితం హరిపాదార్చనం
ప్రహ్లాద చరితం హరి రమ్య కథనం

ఆత్మార్పణం

వికసిత కుసుమం, విరచిత కావ్యం
సవినయ హృదయం, సరళ స్వభావం
సలలిత రాగం, సునిశిత భావం
అర్చనార్థం సమర్పితం మమదేహం!

వేదవేదాంతసారం, విశ్వస్వరూపం
సర్వాత్మకం, సర్వవ్యాపకం, శివం
సత్య సుందరం, సర్వహితాత్మకం
శ్రవణ కీర్తన సహిత ఆత్మనివేదనం సమర్పయామి
దాస సఖ సేవార్పిత ఆత్మ నివేదనం సమర్పయామి
వందనార్చిత చింతనం, ఆత్మనివేదనం సమర్పయామి
నవవిధ భక్తి పూరితం, ఆత్మ నివేదనం సమర్పయామి
మమ కృతాపరాధనే క్షమ స్వయితి ప్రార్థయామి

## సమర్పయామి!!

సఖ్యం కడివెడు కడగండ్లు కట్టిన జోలె దాచలేక
పిడికెడు అటుకులు దాచిన మూట విప్పలేక
తికమక పడెదవు కుచేల నీవిటు
అటుకుల చవిగొని నీకిదె భాగ్యము సఖుడె!

దాసత్వం స్వామి చరణరజము సోక
మానిని పునీత మూర్తికాగ
తానే చరణచారుడాయె మారుతి
రఘురాముని దాసుడాయె నిరతి.

సేవ నీరు నిండిన కనుల మసకైన రూపము
నీలమేఘశ్రీ శ్యాముడు నిలచిన దీపము
శబరి జన్మము కాద సేవకు దర్పణము
రఘువరు చరణాల, శబరి అర్పణము

వందనం 'వందనం', రఘునందన యని
అందమైన కృతులల్లిన ధన్యుడు
పంచరత్నముల పంచియిచ్చిన
పండితోత్తముడు త్యాగయ్యకాద!

సంకీర్తన ‘భావములోన, బాహ్యమునందును’
వెలసిన విభుడె వేంకటపతియని
తిరుమలగిరి యది వికుంఠపురమని
పలికిన అన్నమయ హరిపద కుసుమము.

అర్చనం పాండ్యరాజు వేడ, వచ్చిన వేదముల తల్లి
సుందరేశు మదిన విరిసిన సుమవల్లి
మధురపురము వెలసిన నీరజాక్షి
మాధవ సహోదరి, మన్నింపవె మీనాక్షి!!

చింతనం విష్ణుచింతనయె ఊపిరి కాగ
నిత్యస్మరణయె జీవము కాగ
చరిత నిల్చె విష్ణు చిత్త తనయ
శ్రీపతి హృదయ శృంగార నిలయ!

శ్రవణం నీ నామామృతము సోకి తెలుపాయె చీకటి
నీ కథాశ్రవణము తాకి వెలిగేను కౌముది
నీ పాట విననంత కరిగేను శిలలు
నీ మాట చెవినేయ తొలగేను వెతలు

ఆత్మార్పణం మకుళిత హృదయసుమము
వికసిత ప్రసూనమా యె స్వామి
సజలము కాగ కనుదోయి
రేకువిడె మనము కరుణకదోయి!

అచలము, అఖిలము, అనన్యము నీదయ
అహమది తొలగదు, ఆత్మకప్పినమాయ
అర్పణ సేయగ, అణగదు 'నా' దనుతెర
కర్పురముగ నను కరుగనీయర భవహర!

పదజతులవి నీ పథమును వెదుక
స్వరగతులవి నీ పదముల పాడ
నిరతము నీ చింతన సాగ
పరవశమాయెను బ్రతుకిది కాద!

నిత్య జీవితము నీ కర్చనము స్వామి
సత్య రూపుడ యీా కాఠిన్యమేమి?
ఇచ్చి అభయము కడతేర్చరార,
వచ్చి నాయింట ఇక నిలిచిపోర!!

## సప్తస్వరఝురి

స హంస వాహనీ చలిత స్వరఝరీ
మధుర గళ జనిత లలిత మాధురీ
నీరవ నిశీద నూపుర నిక్వణీ
షడ్జమ స్వర సార చరణ చారిణీ!

రాయంచ రథమెక్కి రాజిల్లు స్వరము
సామవేద సార ఆగమన స్వరము
నిర్జన నీరవాన నినదించు స్వరము
షడ్జమమై రాగఝరి మొదలిడు స్వరము.

'సా'కార రూపాన సంగమించు స్వరము
సరిగమల స్వరాల నాంది స్వరము
నిగమాగమ సార సాగర మథనాన
మకరందమై సాగు మధుర స్వరము.

రి చలిత హరీంద్ర పదగామినీ
సృజన విలాస విధాత భాషిణీ
సజ్జన మానస సంతోష ప్రదాయినీ
సాధు! సాధు! హే రిషభ వాసినీ!!

రంకె వేయు వృషభరాజమ్ము తేజరిల్లు
దశదిశల మార్మోగు రిషభ ధ్వానమ్ము
ద్వితీయ స్వరమై పరిఢవిల్లిన స్వనము
అద్వితీయ భావాల నలరింపజేయు.

రతజగిరి తేజమ్ము రాశిగ ప్రభవించి
ధవళద్యుతి వెదజల్లు రాకేందు బింబమై
రాణించెనదే చూడు రిషభ స్వరము
రాగాలకదియె కాద ఆలవాలమ్ము!

గ
వారిజాసన సతీ వాగార్థ మధురం
వారిజాక్షి వాణీ కరుణార్ద్రలోచనం
నీలగగనాయాస విహంగ రాజసం
గాంధార స్వరం, అనుపమ స్వర సాధనం!

గంధభేరుండము మోయ, గాంభీర్యమొదగ
'గ'కార స్వరమేమొ గగనాల పలికె
గీర్వాణి దేవతగ గమకములు తెలుప
గాంధార్వమై స్వరము గళము నిండె.

ఆరోహణమై, ఆత్మ ఆధ్యాత్మికతను గూడ
ఆకశపుటంచుతాకి, అవని అవధులు దాటి
తృతీయ స్థానమున సంగమించిన స్వరము
గాంధారమై నేడు పుణ్యగతుల చాటె.

మ	శివ జటాజూట సంచలిత ధ్వానం
శివగౌరి లాస్య తరంగిణీ ప్రమోదం
వికసిత జలజ సమ శోభాయమానం
పులకిత గాత్ర జనితం, మధురం మధురం

చెంగుమని దూకు హరిణముల మూపెక్కి
రంగారు మధ్యమ స్వరస్థానమున నలరి
బంగారు తీగెలుగ తేనెల వాకలుగ
స్వరఝురుల సాగేటి మధ్యమ స్వరమ్ము
పరమేశు పాదాల ప్రభవించు గీతమ్ము
గిరిజేశు కారుణ్య చూడ్కుల భావమ్ము
మొరసేను ప్రణవ నాదంపు సారము
'మ'కారమై విరియు ఓంకార నాదము.

ప	నవవసంత పికగళ కూజితారవం
నవనీతచోరం, నయనాభిరామం
పన్నగేంద్ర శయన పద పంకజ శోభితం
పంచమ స్వరం, ప్రణమామ్యహమ్

నవ వసంతాగమనమున కోకిలారావం
పంచమ స్వనాన వినిపించుగానం
ప్రకృతి పులకించు ప్రణయరాగం
శ్రీహరి పదకమల మంజీర నాదం.

గోకులమున దధి చిలుకు మంజులారావం
గోపాలకృష్ణుని చిలిపి చేతల భావం
భాసిల్లు నవ చూత రసాల సారం
రాజిల్లె నదె చూడు పంచమస్వరరాగం.

ద కరి వదన కరుణా శ్వాస భరితం
కరి రాజ గణనిగళ సంపూర్ణరావం
సప్తస్వర రాగ గాంభీర్య భావం
వందే శుద్ధ దైవతాస్థానం!!

ఘూర్ణిల్లు మత్తేభము పలికె దైవతము
రా చిలుక వాహనముగ ఊరేగు స్వరము
దయచూచు యాజ్ఞికుని ఆశీస్సు బలము
శుద్ధ దైవతముగ ప్రభవించు స్వరము.

గణనాథుడే పతిగ వెలుగొందు స్వరము
పంచమ స్వరమున కనుజ స్వరము
పంచభూతముల ప్రతిధ్వనించువేళ
ఇభరాజు పలికేటి గంభీరస్వరము.

ని బాలార్క కిరణారుణ ద్యుతీ
సప్తమ స్వరస్థాన నిషాద'నీ'
సరిగమ పదని సప్త స్వరఝరీ
వందే సామవేద సార స్వరమాధురీ!!

హయములు రయమున పలికెను నిషాదము
గొరవంక వాహనముగ చెలరేగు స్వరము
బాల భాస్కర ద్యుతి శోభిల్ల మెరసి
సప్తమ స్వరమై నినదించె నిషాదము.

స్వరఝరి కదలగ ప్రనవము మొరవగ
ప్రకృతి పులకించె, పృథివి నర్తించె
ప్రచండ మార్తాండ తేజమ్ము ప్రజ్వరిల్ల
సంగీత మాధురులు జగమెల్ల నిండె!!

## అద్వితీయం, సంఖ్యా కథనం

సర్వ జగదాధారం ఏకైక బ్రహ్మం
సర్వ మూలాధారం పరబ్రహ్మ రూపం
సర్వ రూప మూలం ఏకైక మాత్మం
సర్వాత్మ స్వరూపం ఏకైక శక్తిం.

శక్తి సంయుత శివం, ఆది మిథునం
శివసహిత గౌరీం, అనాది పూజ్యం
జగత్కళ్యాణ కారణం, జననీ జనకం
వందే ప్రకృతీ పురుషం, సృష్ట్యాధారం

బ్రహ్మ విష్ణు శివాత్మకం, త్రిభువన పాలకం
సృష్టి స్థితి లయాత్మకం జీవన భ్రమణం
పరాశక్తి స్వరూపం త్రిమూర్త్యాత్మకం
తాపత్రయం హరం, త్రిమూర్తి సేవనం!

చతుర్ముఖ ప్రకటితం, చతుర్వేదసారం
మౌన విదితం, అపౌరుషేయం
అవిరచిత భాష్యం, అమూల్య భావం
ఋగ్యజుస్సామ వేద, అథర్వణ సారం

పంచకన్య చరితం, సౌందర్య భరితం
పాంచాలి కథనం, పరమపవిత్రం
మయపుత్రి మండోదరి, జానకీ సమానం
అహల్య, తారోపాఖ్యానం, ఆద్యంత మధురం

అరిషడ్వర్గ సహితం మానవ హృదయం
నిరంతర కల్పిత మాయాజాలం
హరినామస్మరణం, అతులిత కటాక్షం
షడ్ర సోపేత ఆహార తుల్యం

కౌశికాది సప్త మహర్షి సేవితం
పులస్త్య పురూరవ వసిష్ఠాది వందితం
సప్తమాతృకాసహిత సాధుభావం
సప్త ద్వీప వసుంధరా, వందే భారతం

అష్ట దిక్పాలకం, అరిష్ట వారిశాం
అష్టసిద్ధి సమన్వితం ఆదిత్య హృదయం
అష్టలక్ష్మి వైభవం, అనంత శుభప్రదం
అష్టోత్తర శతనామ పూజ్యం, అచ్యుత పదయుగం.

నవధాన్య భరితసేద్యం సస్య శ్యామలం
నవగ్రహానుగ్రహం శుభదాయకం
రవిచంద్ర గురు శుక్ర మంగళ బుధం
శని రాహుకేతం శిరసానమస్కృతం

మత్స్యకూర్మ వరాహాది దశావతారం
జగన్మూలకం దశోపనిషత్సారం
ఆదిమధ్యాంత రహిత మంగళ స్వరూపం
నిర్గుణాకారం నిగమాగమసారం

ప్రథమ వందితం ప్రజ్వల జ్యోతిం
భువన విరచితం గగన వ్యాప్తం
మనుజ హృదయజనిత ప్రణయదీపం
సకల సజ్జన మానసం శాంతి నిలయం.

ఏకో నారాయణ మచ్యుతం
అనేకం పరమాత్మ స్వరూపం
నామరూప రహితం అనంతజీవం
ఓంకార మిళితం విశ్వజన నాదం.

# గాలిపల్లకి



డా॥ ఉమ శ్రీ సగరం కాశీపతి రావు శ్రీమతి వెంకట రమణమ్మల ఐదవ కుమార్తె. హైదరాబాద్ లోని మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాలలో హైస్కూల్ విద్యాభ్యాసం. ఉస్మానియా మెడికల్ కాలేజీలో యం.బి.బి.యస్. తరువాత ఇ.యన్.టి.లో యం.యస్.

భర్త డా॥ రామానుజం, U.S.A. లో ఫ్లోరిడాలో జనరల్ సర్జన్.

డా॥ ఉమ ENT Specialist.

సంతానం చి. శ్రీకర్, చి. స్వాతి

అమెరికాలోని కొన్ని ప్రతిష్టాత్మకమైన సేవా సంస్థలలో బాధ్యతా యుతమైన అనేక పదవులు నిర్వహిస్తూ సాంఘిక సేవలో పాలు పంచుకుంటున్నారు.

ముద్రిత రచనలు : 'తుహిన కణాలు' కవితా సంకలనం. వివిధ పత్రికలలో పెక్కు వ్యాసాలు కవితలు ప్రచురించారు.